# జూన్‌లో బజాజ్ సీఎన్‌జీ బైక్‌లు

- దేశంలోనే తొలిసారిగా రూపకల్పన
- ధర 80 వేల లోపు: రాజీవ్ బజాజ్



*బజాజ్ బియాండ్ కార్యక్రమంలో రాజీవ్ బజాజ్, మాధుర్ బజాజ్, శేఖర్ బజాజ్, నీరజ్, సంజీవ్*

**వాహనదారులు** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సీఎన్‌జీ బైకులు రాబోతున్నాయి. దేశంలోనే తొలిసారిగా తాము రూపొందించిన సీఎన్‌జీ ద్విచక్ర వాహనాలను ఈ ఏడాది జూన్‌లో ఆవిష్కరించనున్నట్లు బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ వెల్లడించారు. శుక్రవారం పుణె పింప్రీ చించోడ్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఉద్దేశించిన బజాజ్ బియాండ్ కార్యక్రమాన్ని బజాజ్ ఎలక్ట్రికల్స్ సంస్థ సీఎండీ శేఖర్ బజాజ్, బజాజ్ ఆటో సీఎండీ నీరజ్ బజాజ్‌లతో కలిసి రాజీవ్ బజాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ బజాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ బైక్ టెస్టింగ్ దశలో ఉన్నదని, వచ్చే మూడు నెలల్లో దేశీయ మార్కెట్లోకి విడుదల చేయడానికి చర్యలను వేగవంతం చేసినట్లు చెప్పారు. సీఎన్‌జీ వాహనాలను వినియోగించడంతో పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతున్నదన్నారు. ప్రస్తుతం దేశంలో 60 శాతం ఆటోలు సీఎన్‌జీతోనే నడుస్తున్నాయని, తద్వారా వాతావరణ కాలుష్యం తగ్గుతుండటం ఇది మంచి పరిణామమన్నారు. ఇదే కోవలో తాము ద్విచక్ర వాహనాన్ని రూపొందించేందుకు ప్రయత్నించామని, కార్లు, ఆటోల్లో సీఎన్‌జీ సిలిండర్ పెట్టేందుకు చోటు ఉంటుందని, కానీ బైకుకు సిలిండర్ ఏ చోట పెడితే బాగుంటుందన్న అంశంపై అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఈ బైకు ధర రూ.70 వేల నుంచి 80 వేల స్థాయిలో ఉంటుందని ఆయన సూచనప్రాయంగా చెప్పారు.


**ఐదేండ్లల్లో స్కిల్ డెవలప్‌మెంట్‌పై 5 వేల కోట్లు**

రాబోయే ఐదేండ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ. 5 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు బజాజ్ సంస్థ ప్రకటించింది. బజాజ్ బియాండ్ పేరుతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద ఆయా మొత్తాన్ని నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని సంస్థ వర్గాలు ప్రకటించాయి. ఈ ఐదేండ్లలో దేశ వ్యాప్తంగా 2 కోట్ల మంది యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణను ఇవ్వనున్నట్లు సంస్థ ప్రకటించింది. జాతీయంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు సీఐఐ... రాహుల్ బజాజ్ సెంటర్ అఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్కిల్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా బజాజ్ సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందినవారు బజాజ్‌తోపాటు ఏ కంపెనీలోనైనా ఉద్యోగాలు పొందవచ్చు అన్నారు. అనంతరం పుణెలోని సింబాయాసిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏర్పాటు చేసిన బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్స్ ట్రైనింగ్ (బెస్ట్) సెంటర్‌ను రాజీవ్ బజాజ్ ప్రారంభించారు.

**–పుణె నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి**

# అయ్యయ్యో.. రూపాయి

- ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ
- ఒక్కరోజే 48 పైసలు పతనం
- డాలర్‌తో 83.61కి మారకం విలువ



ముంబై, మార్చి 22: ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలవిల్లాడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి క్షీణించింది మరి. ఈ ఒక్కరోజే ఏకంగా 48 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.61 వద్ద నిలిచింది. వరుస నష్టాల నుంచి కాస్త కోలుకున్నదనుకునేలోపే.. మళ్లీ భారీ నష్టాన్ని చవిచూసింది. 8 రోజులపాటు ఏకధాటిగా దిగజారిన రూపాయి మారకం విలువ గురువారం 6 పైసలు పెరిగి ఊపిరి పీల్చుకున్న విషయం తెలిసిందే. అయితే డాలర్ ముందు నిలబడలేక తిరిగి 48 పైసలు కోల్పోయింది. ఒకానొక దశలోనైతే 52 పైసలు నష్టపోయి 83.65 వద్దకు దిగి ఆల్‌టైమ్ ఇంట్రా–డే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ క్రమంలో దేశం నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ ట్రేడర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాగా, గత ఏడాది డిసెంబర్ 13న డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 83.40 స్థాయిని చేరి జీవన కాల కనిష్ఠాన్ని సృష్టించింది. ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిని దాటి రూపీ నష్టాలను మూటగట్టుకున్నది. నిజానికి ఉదయం ఆరంభంలో లాభాల్లో ట్రేడైఆకట్టుకున్న రూపీ.. సమయం గడుస్తున్న కొద్దీ పతనం దిశగానే పయనించింది. ఇదిలావుంటే రూపాయి విలువ ఇలాగే పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థపై ఆ ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందన్న ఆందోళనలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. విదేశాల నుంచి దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులు, సేవలు ఖరీదెక్కుతాయని, ఇది ద్రవ్యోల్బణానికి దారితీయగలదంటున్నారు. ఇదే జరిగితే ఇప్పటికే వడ్డీరేట్లను అధిక స్థాయిలోనే ఉంచుతున్న ఆర్బీఐ.. మరి కొంత కాలం కోతల జోలికి పోదని, అప్పుడు రుణ భారం పెరిగి అన్ని రంగాలు కుదేలవుతాయన్న అంచనాలున్నాయి.

# తగ్గిన బంగారం ధర

**రూ.875 క్షీణించి రూ.66,575కు తులం**

**కిలో వెండి రేటూ రూ.760 డౌన్**

న్యూఢిల్లీ, మార్చి 22: బంగారం ధరలు పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. గురువారం రికార్డు స్థాయికి చేరిన రేట్లు.. శుక్రవారం అక్కడి నుంచి దిగజారాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ పుత్తడి 10 గ్రాములు రూ.875 తగ్గి రూ.66,575 వద్ద స్థిరపడింది. హైదరాబాద్‌లోనూ తులం రూ.490 పడిపోయి రూ.66,930 వద్ద నిలిచింది. దేశ రాజధానిలో మునుపెన్నడూ లేనివిధంగా గురువారం తులం పసిడి ధర రూ.1,130 ఎగబాకి రూ.67,450 వద్దకు చేరిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్సు బంగారం 35 డాలర్లు దిగి 2,167 వద్ద ఉన్నది. ఇక వెండి విషయానికొస్తే.. ఢిల్లీలో కిలో ధర రూ.760 పతనమై రూ.76,990కు పరిమితమైంది. హైదరాబాద్‌లో ఏకంగా రూ.2000 క్షీణించి రూ.76,500లకు తగ్గింది. గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్సు 24.45 డాలర్లుగానే ఉన్నది. అటు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ పసిడికి స్వల్పంగా ఆదరణ పడిపోయింది.

## బాలెనో, వ్యాగన్ ఆర్ కార్ల రీకాల్

న్యూఢిల్లీ, మార్చి 22: బాలెనో, వ్యాగన్‌ఆర్ మాడళ్లకు చెందిన 16 వేల యూనిట్లను రీకాల్ చేస్తున్నట్లు మారుతి సుజుకీ ప్రకటించింది. ఫ్యూయల్ పంప్ మోటార్‌కు సంబంధించి తలెత్తిన సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో జూలై 30, 2019 నుంచి నవంబర్ 1, 2019 వరకు తయారైన 11,851 యూనిట్ల బాలెనో, 4,190 యూనిట్ల వ్యాగన్‌ఆర్ మాడళ్లను వెనక్కి పిలిపిస్తున్నట్లు తెలిపింది.












Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.